
# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 74 | మంగళవారం, 10 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4

# ఓటరన్నా.. నమస్తే..

## ప్రలోభాలు షురూ!

- ముగిసిన మున్సిపల్ ప్రచార పర్వం
- మందు, నగదు పంపిణీకి శ్రీకారం
- వార్డును బట్టి ఓటు రేటు..!
- ఓటరు ప్రసన్నమే ప్రధాన లక్ష్యం
- చివరి రోజు హోరెత్తిన ప్రచారం

జనగామ మున్సిపాలిటీ పరిధిలో గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచార పర్వం సోమవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. అయా వార్డుల్లో ఇన్ని రోజులు తిరిగిన మైక్ సెట్లు, లౌడ్ స్పీకర్లు మూగబోయాయి. రాజకీయ పార్టీల నేతల కార్నర్ మీటింగులు అగిపోయాయి. ఇక చివరి ఘట్టమైన ఓటర్లను ప్రసన్నం కోసం అభ్యర్థులు వారి పనుల్లో ముగినిపోయారు. ఈనెల 11న జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా

2 లో

సర్పంచ్‌లకు

## కొత్త అధికారాలు

- అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత సర్పంచ్‌లకే
- అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం



4 లో



## పోలింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వసతులు బాగుండాలి
- పోలింగ్ అధికారులకు ఇబ్బందులు కలగద్దు
- సిబ్బందికి నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

3




# ఓటరన్నా.. నమస్తే..!

## ప్రలోభాలు షురూ!

- ముగిసిన మున్సిపల్ ప్రచార పర్వం
- మందు, నగదు పంపిణీకి శ్రీకారం
- వార్డును బట్టి ఓటు రేటు..!
- ఓటరు ప్రసన్నమే ప్రధాన లక్ష్యం
- చివరి రోజు హోరెత్తిన ప్రచారం

(ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా)



జనగామ మున్సిపాలిటీ పరిధిలో గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచార పర్వం సోమవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. అయా వార్డుల్లో ఇన్ని రోజులు తిరిగిన మైక్ సెట్లు, లౌడ్ స్పీకర్లు మూగబోయాయి. రాజకీయ పార్టీల నేతల కార్నర్ మీటింగులు అగిపోయాయి. ఇక చివరి ఘట్టమైన ఓటర్లను ప్రసన్నం కోసం అభ్యర్థులు వారి పనుల్లో మునిగిపోయారు. ఈనెల 11న జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### మున్సిపల్ పీఠం ఎవరిదో..?

మున్సిపల్ ఎన్నికల ప్రచారం మొదలైన నాటి నుంచి పూర్తయ్యే వరకు జనగామ మున్సిపల్ పరిధిలో ఓటరు నాడి ఎటు వైపు ఉందో నేతలకు తెలియడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఎక్కడకు వెళ్ళినా మంచి స్పందన వచ్చింది. కానీ మున్సిపల్ పీఠం మాదే అని ఎవరూ ధీమాగా చెప్పడం లేదు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ టికెట్ల కెటాయింపులో పక్కా వ్యూహంతో వెళ్లగా.. కాంగ్రెస్ కొంత తత్సారం చేయండి కొంత గందరగోళం నెలకొంది. ఎట్టకేలకు నామినేషన్ల చివరి రోజు కాంగ్రెస్ అభ్యర్థలను ప్రకటించక పోవడం ఆ పార్టీలో క్యాడర్ కొంత ఇబ్బందులు పడ్డారు. చివరకు కొంతరు రెబల్స్‌గా బరిలో ఉన్నారు. ప్రచారానికి కూడా కేవలం ఆరు రోజులు మాత్రమే గడువు ఉండడంతో అభ్యర్థులు వీలైనంత మేరకు ప్రచారాన్ని ముమ్మరం చేసి ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేశారు.

### ఓటరు ప్రసన్నం ఎటువైపో..

సోమవారం సాయంత్రం జరిగిన ప్రచారం ఒక వంతైతే పోలింగ్ సమయం వరకు జరిగే తంతు మరో వంతు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రలోభాల పర్వానికి తెరలేపారు. వార్డుల వారీగా ఓటర్ లిస్టులు పట్టుకుని ఇంటింటి తిరుగుతూ తమ పని కానిస్తున్నారు.

### ఒక్కో వార్డులో ఒక్కో రేటు..

జనగామలోని 30 వార్డుల్లో ఓటర్లను అకట్టుకునేందుకు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. పోటీ బట్టి ఒక్కో వార్డులో ఒక్కో రేటు ఫిక్స్ చేసుకుని నగదు పంపిణీకి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి నుంచే కొన్ని వార్డులు నగదు పంపంకాలు షురూ కాగా.. మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున నగదు బదిలీ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.



జనగామ బీరప్పగడ్డలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చాలమ కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి తదితరులు



జనగామ రైల్వే స్టేషన్ ప్రాంతంలో జాగృతి కవిత కుటమి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) అభ్యర్థి అనంతుల ఆంజనేయులు ప్రచారం




జనగామ 28వ వార్డులో కళాకారులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి సునితా రాణి



చేర్యాల పట్టణంలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ



జనగామలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
మంగళవారం, 10 ఫిబ్రవరి 2026
Mana Chourasta


# గ్రామ అభివృద్ధికి దిశానిర్దేశం

## గట్లనర్సింగాపూర్ గ్రామసభలో కీలక చర్చ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై విస్తృతంగా చర్చ జరిగింది. గ్రామ సభలో మాట్లాడిన సర్పంచ్ అజయ్ కుమార్ గ్రామస్తుల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామస్థుడు బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించిన సర్పంచ్, తడి-పొడి చెత్తను వేరు చేయడం, డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణ చర్యల్లో గ్రామ ప్రజలు సహకరించాలని అన్నారు. శుభ్రమైన గ్రామమే ఆరోగ్యవంతమైన గ్రామమని ఆయన పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా బోర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్వహణ, నీటి వృథాను అరికట్టే చర్యలు చేపట్టాలని గ్రామసభలో నిర్ణయించారు. గ్రామంలోని రహదారులు, వీధిలైట్ల మరమ్మతులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై కూడా చర్చ జరిగింది. అలాగే మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడం, ఉపాధి హామీ పనులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని గ్రామసభలో సూచించారు. విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజా భాగస్వామ్యం లేకుండా గ్రామాభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్న సర్పంచ్, ప్రతి గ్రామసభలో ప్రజల సూచనలు తీసుకుని పారదర్శకంగా పనులు చేపడతామని తెలిపారు. గ్రామసభలో ఉప సర్పంచ్ బోడిగె శ్రీనివాస్, గ్రామ పంచాయితీ కార్యదర్శి గుడికందుల మధు, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లంపల్లి సుకుమార్, కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన హరిక్రిష్ణ యాదవ్, బొల్లంపల్లి రాజు, అంబాల శ్రీనివాస్, సీతంపేట శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పోలింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వసతులు బాగుండాలి
- పోలింగ్ అధికారులకు ఇబ్బందులు కలగద్దు
- నాణ్యమైన భోజనం పెట్టాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో జరిగే మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. 11న జరిగే జనగామ, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పోలింగ్ స్టేషన్ లో చేపట్టాలిసిన ఏర్పాట్ల పైన అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ఆర్డీవో లు, మున్సిపల్ కమిషనర్లతో, నోడల్ అధికారులతో సోమవారం గూగుల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేపు ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో పక్కాగా అన్ని ఏర్పాట్లు ఉండాలన్నారు. పోలింగ్ అధికారులకు నాణ్యమైన ఆహారం అందించాలని, పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సరిపడా వాహనాలను అందుబాటులో పెట్టాలన్నారు. పోలింగ్ అధికారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, నోడల్ అధికారులు కూడా తమ పరిధిలో గల ప్రతీ అంశం పైన బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించాలన్నారు. సమయానికి పోలింగ్ రిపోర్ట్ లను అందించాలని, వంద శాతం వెబ్ కాస్టింగ్ కి ఏర్పాటు చేశామని తెలిపారు. FST, SST టీమ్ లు అప్రమత్తం గా ఉండాలని, బ్యాలట్ పేపర్ జాగ్రత్త నిర్వహణ ఉండాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలట్ పేపర్స్ ని జాగ్రత్త గా స్ట్రాంగ్ రూమ్ లో భద్ర పరచ్చాలన్నారు. ఎన్నికల సిబ్బంది ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించే సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

- 5వ వార్డు స్వతంత్ర అభ్యర్థి మిద్దెపాక భాస్కర్



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణం 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థి మిద్దెపాక భాస్కర్ గీతానగర్, వికాస్ నగర్, ఏసీ రెడ్డి నగర్, ఇందిరమ్మ కాలని, పడవ హాస్టల్ వెనుక ,కోర్ట్ ఎదురు ఏరియా లో వార్డు యువత , మహిళలు, తన మద్దతు దారులతో కలసి గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. నాయకుడిలా కాదు మీ సేవకుడిలా పని చేస్తా మీతో ఉంటా... మీలో ఉంటా... మీ వెంటే ఉంటా.. అహర్నిషలు వార్డు అభివృద్ధికై పోరాడుతా.. హామీ ముందుకు సాగారు. స్మశాన వాటిక ఏర్పాటుకు కృషిచేస్తానని, రోడ్డు విస్తీర్ణం రోడ్డు సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రతి మూడు నెలలకు హెల్త్ క్యాపు నిర్వహిస్తామని తెలిపారు. వార్డులో ప్రతి రోజు అందుబాటులో ఉంటూ వార్డులోని సమస్యలను సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చింతకుంట్ల శ్రీనివాస్, ఎండి అయోబ్, లింగాల అనిల్, దుసరి సంపత్, బిర్రు శివ, నిడికొండ మహేష్, బోబాల రాజు, కాసాని విజయ్, వంగ మహేష్, బిర్రు శ్రీధర్, వాడగం రాజు పాల్గొన్నారు.



# పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జనరల్ అబ్జర్వర్ నర్సింహారెడ్డి



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించి భరోసా ఇవ్వాలని, ఎన్నికల అబ్జర్వర్ నర్సింహా రెడ్డి అన్నారు. జనగామ మున్సిపాలిటీ లోని జ్యోతి నగర్ పరిధిలో గల సేయింట్ మేరీస్ హై స్కూల్, నెహ్రూ నగర్ లో మండల పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లను సోమవారం జనరల్ అబ్సర్వర్ నర్సింహా రెడ్డి పరిశీలించారు. ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అబ్సర్వర్ సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మాతృ నాయక్, లైజనింగ్ అధికారి అన్వేష్, మున్సిపల్ వార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లకు కొత్త అధికారాలు

- అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత సర్పంచ్‌లకే
- అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం



**హనుకొండ, మన చౌరాస్తా :** తెలంగాణలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన కొత్త అధికారాలను అప్పగించింది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్‌లే చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందేలా చేయడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. గత రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పినట్లు ప్రభుత్వం గుర్తించింది. అనేక చోట్ల పోషకాహారం పక్కదారి పడుతున్నట్లు నివేదికలు రావడంతో ఈ చర్యకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాలకు అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కమిటీలో సర్పంచ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మొత్తం 11 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటవుతుంది. అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, పాఠశాల సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న బియ్యం, పప్పులు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి సరుకుల నాణ్యతను, పంపిణీ విధానాన్ని పరిశీలించనుంది. అలాగే ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న భోజనాన్ని కూడా తనిఖీ చేస్తుంది. లక్షల రూపాయల విలువైన పోషకాహారం నిజమైన లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడటమే ఈ కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడుతుందని, గ్రామస్థాయిలో పర్యవేక్షణ మరింత బలపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# బీర్ల కోసం మద్యం ప్రియుల ఆగ్రహం

## కాసా వైన్స్ వద్ద ఉద్రిక్తత




**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఉన్న కాసా వైన్స్ వద్ద సోమవారం మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖంగా వినియోగించే బడ్వైసర్ బీర్లు, బడ్వైసర్ టిన్లు స్టాక్‌లో లేవని నిర్వాహకులు చెప్పడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం వేళ భారీగా మద్యం కొనుగోలుదారులు వైన్స్ ఎదుటకు చేరుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. తరచూ బీర్ల కొరత ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు, నిర్వాహకులు సరైన చర్యలు తీసుకోవడం లేదని వినియోగదారులు ఆరోపించారు. డిమాండ్ ఉన్న బ్రాండ్లను అందుబాటులో ఉంచకుండా విక్రయ కేంద్రాలు నడపడం సరికాదని, ముందస్తు సమాచారం లేకుండా స్టాక్ లేకపోవడం ఇబ్బందులకు గురి చేస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకోగా, పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు కాసా వైన్స్ షట్టర్‌ను తాత్కాలికంగా మూసివేశారు. బీర్ల సరఫరాలో లోపాలే ఇందుకు కారణమని నిర్వాహకులు పేర్కొనగా, తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



# సత్తా చాటిన ముల్కనూర్ విద్యార్థినులు

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థినులు అసాధారణ ప్రతిభ కనబరిచి క్రీడా రంగంలో తమ సత్తాను చాటారు. జిల్లా స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో ముల్కనూర్ మోడల్ స్కూల్ బాలికల జట్టు ద్వితీయ బహుమతిని సాధించి పాఠశాలకే కాదు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రతిభావంతమైన జట్లతో పోటీ పడిన ముల్కనూర్ విద్యార్థినులు సమన్వయం, శ్రమ, క్రమశిక్షణతో కూడిన ఆటతీరుతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కీలకమైన మ్యాచ్‌లలో ధైర్యంగా ఆడి ఫైనల్‌కు చేరువగా పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచారు. ఈ విజయం వెనుక విద్యార్థినుల కఠిన సాధనతో పాటు శిక్షకులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రెహమాన్ మాట్లాడుతూ, "చదువుతో పాటు క్రీడల్లోనూ బాలికలు ముందుండటం గర్వకారణం. ఈ విజయం మరిన్ని విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తుంది" అని అన్నారు. విజేతలైన విద్యార్థినులను అధ్యాపక బృందం, సహ విద్యార్థులు అభినందించగా, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# బతుకమ్మ బండ స్థలంపై వివాదం

## ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ బండ నిర్మాణానికి కేటాయించిన స్థలం విషయంలో వివాదం తలెత్తింది. గత నెల 26న రంగాయపల్లి గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి బతుకమ్మ బండ నిర్మాణం కోసం గ్రామపంచాయతీకి 33 గుంటల స్థలాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం కూడా నిర్వహించారు. అయితే, బతుకమ్మ బండ నిర్మాణానికి సంబంధించిన స్థల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా రికార్డులు పరిశీలించగా, అదే స్థలం 2009 సంవత్సరంలోనే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరుపై రిజిస్ట్రేషన్ అయి ఉన్నట్లు గ్రామపంచాయతీ పాలకవర్గం గుర్తించింది. ఈ విషయంపై సోమవారం నాడు హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణి కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మండల రజని మాట్లాడుతూ, గ్రామ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బతుకమ్మ బండ నిర్మాణాన్ని చేపడుతున్న తరుణంలో, దానం చేసిన స్థలం వేరొకరి పేరుపై రిజిస్ట్రేషన్ అయి ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గ్రామస్తులు సంబంధిత వ్యక్తిని సంప్రదించగా తాను భూమి రిజిస్ట్రేషన్ చేయలేదని తెలిపినట్లు ఆమె వెల్లడించారు. గ్రామ మహిళల కోసం చేపట్టిన బతుకమ్మ బండ నిర్మాణానికి అన్ని వర్గాల నాయకులు, సంబంధిత వ్యక్తులు సహకరించాలని కోరుతూ, సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చే ఉద్దేశంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజితతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి దిశానిర్దేశం

## ములకనూరులో గ్రామసభ



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. గ్రామసభలో మాట్లాడిన సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి గ్రామస్తుల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామస్థుడు బాధ్యతతో ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్యంపై దృష్టి సారించిన సర్పంచ్, తడి-పొడి చెత్తను వేరు చేయడం, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచడం, దోమల నివారణ చర్యల్లో గ్రామ ప్రజలు చురుగ్గా సహకరించాలని పిలుపునిచ్చారు. శుభ్రమైన గ్రామమే ఆరోగ్యవంతమైన గ్రామానికి పునాది అని ఆయన పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా బోర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్వహణపై పర్యవేక్షణ పెంచాలని, నీటి వృథాను అరికట్టే చర్యలు చేపట్టాలని గ్రామసభలో నిర్ణయించారు. అలాగే గ్రామంలోని రహదారులు, వీధిలైట్ల మరమ్మతులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై కూడా చర్చ జరిగింది. మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడం, ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని గ్రామసభలో సూచించారు. విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ప్రజా భాగస్వామ్యం లేకుండా గ్రామాభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేసిన సర్పంచ్, ప్రతి గ్రామసభలో ప్రజల సూచనలు తీసుకుని పారదర్శకంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ గ్రామసభలో ఉప సర్పంచ్ కాసగోని మమత బాలకృష్ణ, పంచాయతీ కార్య నిర్వహణ అధికారి పూర్ణచందర్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇక రాంనగర్‌లో వారాంతపు సంత

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి బుధవారం వారపు సంతను నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ డప్పు శ్రీనివాస్ అధికారికంగా ప్రకటించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీసుకున్న ఈ నిర్ణయం గ్రామ అభివృద్ధి దిశగా మరో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. గ్రామపంచాయతీ చరిత్రలో తొలిసారిగా వారపు సంతను ప్రారంభించడం విశేషమని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రతి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సంత రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. గ్రామస్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, సౌకర్యవంతమైన సమయాల్లో సంతను నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ సంత ద్వారా చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. అలాగే కిరాణా, కూరగాయల, పండ్ల, గృహోపకరణాల వ్యాపారులు తమ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. గ్రామ ప్రజలకు నిత్యావసర వస్తువులు ఒకేచోట అందుబాటులో లభించడంతో పాటు, ధరల పరంగా కూడా లాభం చేకూరుతుందని సర్పంచ్ తెలిపారు. స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చే విధంగా ఈ సంత ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాంనగర్ గ్రామంతో పాటు రైతులు, వ్యాపారులు ఈ వారపు బుధవారం సంతను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ డప్పు శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**